పేద బిడ్డగా.. జోలె పట్టుకొని అడుగుతున్నా..

ఓటేసి నన్ను గెలిపించండి

మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేష్‌యాదవ్



కొండాపూర్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ మేడ్చల్ ఎమ్మెల్యే అభ్యర్థి వజ్రేష్‌యాదవ్

మేడ్చల్ జోన్ బృందం: పేద బిడ్డను.. జోలె పట్టుకొని అడుగుతున్నా.. మీ విలువైన ఓటు వేసి తనను గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ కోరారు. మంగళవారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కొండాపూర్, కరీంగూడ చౌరస్తా, అంబేడ్కర్‌నగర్, బొక్కొనిగూడ, ఎన్ఎఫ్‌సీ నగర్‌లో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లకు మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, రాష్ట్ర సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మేడ్చల్ ఎమ్మెల్యేగా, మల్కాజ్‌గిరి ఎంపీగా దశాబ్దకాలంగా అధికారంలో ఉన్న మంత్రి మల్లారెడ్డి నియోజకవర్గానికి చేసిందేమీ లేదని, మీ ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. నియోజకవర్గం అభివృద్ధిపై అసెంబ్లీలో ఒక్కసారి కూడా ప్రస్తావించకపోవడం సిగ్గుచేటని, నియోజకవర్గంలో పరిశ్రమలు, ఐటీ హబ్ స్థాపించలేదన్నారు. ఘట్‌కేసర్ రైల్వే వంతెన నిర్మించలేదని, వంతెన బాధితులకు పరిహారం ఊసేలేదని మండిపడ్డారు.

నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం..

మేడ్చల్ నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. నాగారం మున్సిపల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పలు వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీలో కాంగ్రెస్ నేతలు సైతం ప్రచారం నిర్వహించారు. శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాలతో పాటు తూంకుంట మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గడప గడపకి కాంగ్రెస్ నినాదంతో ప్రచారం నిర్వహించారు.

ప్రచారంలో కార్యకర్తలు, ప్రజలు





శామీర్‌పేట, అలియాబాద్‌లో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



నాగారంలో కాంగ్రెస్ నేతల ప్రచారం





ప్రజలంతా బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టేందుకు సిద్ధం

మేడ్చల్‌రూరల్: సీఎం కేసీఆర్ తన పాలనలో రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి పథకాలతో అన్ని వర్గాలను ఆదుకున్నాడని, ఇలాంటి నాయకుడు మళ్లీ తమకు దొరకడని భావించిన రాష్ట్ర ప్రజలు కేసీఆర్ మళ్లీ రావాలని కోరుతూ బీఆర్‌ఎస్‌కు పట్టం కడుతున్నారని మేడ్చల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి మల్లారెడ్డి అన్నారు. మంగళవారం మేడ్చల్ మండలంలోని గ్రామాల్లో మంత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత పాలకులు ఎవరూ చేయని విధంగా కేసీఆర్ సాగునీరు, తాగునీరు, నాణ్యమైన కరెంట్, పెన్షన్, రైతుబంధు వంటి సంక్షేమ, అభివృద్ధి పథకాలతో అందరికీ మేలు చేశాడని ప్రజలంతా బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. ఇలాంటి సీఎంను మరోసారి గెలిపించుకుంటామని ప్రజలు తెలుపుతున్నారని, తాను సైతం ఇంత ఆదరణ వస్తుందని ఊహించలేదన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రమంతా అభివృద్ధేనని, కాంగ్రెస్ అంటే కరువు, స్కాములని, కేసీఆర్ నీళ్లు నిధులు అని ప్రజలకు తెలుసన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో మహిళలకు మట్టి అంటకుండా రోడ్లు వేయించానని, ప్రజలకు ఎక్కడ చూసినా తాను చేసిన అభివృద్ధే కనిపిస్తుందని వారు అని తెలుసన్నారు. కాంగ్రెస్ గాలి ఎట్ల వస్తుందో తనకు అర్థం కావడం లేదన్నారు. గాలికి తిరిగితే గాలి వస్తుందా అని ప్రశ్నించారు. ప్రజలంతా బీఆర్‌ఎస్‌కు మరోమారు పట్టం కడతారని తెలిపారు.

ఆత్మీయ సమ్మేళనాలు, కార్నర్ మీటింగ్స్..

ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి మల్లారెడ్డి శామీర్‌పేట్‌లో పద్మశాలి ఆత్మీయ సమ్మేళనం, ఘట్‌కేసర్‌లో రజక సంఘం ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. మేడ్చల్ మండలంలోని గ్రామాల్లో కార్నర్ మీటింగ్స్‌లో పాల్గొని బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని ప్రజలను వేడుకున్నారు.

జోరుగా ప్రచారం..

దమ్మాయిగూడ, నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మంత్రి తనయుడు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత చామకూర భద్రారెడ్డి మున్సిపల్ చైర్మన్లు కౌకుట్ల చంద్రారెడ్డి, ప్రణీతాగౌడ్, నాయకులతో కలిసి పాల్గొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలో, గ్రామాల్లో పార్టీ శ్రేణులు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు.



లింగాపూర్‌లో ఎన్నికల ప్రచారంలో మంత్రి మల్లారెడ్డి



మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

కాంగ్రెస్ పార్టీ మింగుతది..
బీఆర్‌ఎస్ పార్టీ పంచుతది

ఘట్‌కేసర్: మాయదారి కాంగ్రెస్ పార్టీని నమ్మొద్దని, స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పేదలను ఆదుకోలేదని, భోగభాగ్యాలు అనుభవించారని, కాంగ్రెస్ మింగే పార్టీ, పంచే పార్టీ పంచే బీఆర్‌ఎస్ అని మేడ్చల్ అసెంబ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి మల్లారెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ డీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో రజక సంఘం మండల ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం అన్ని కులాలను ఆదరించిందని, నాలుగైదు కోట్లతో ఆధునాతన దోబీఘాట్‌ను నిర్మిస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చేసిన అభివృద్ధి శూన్యమని, ఆయనకు పత్తాలాట, గుర్రాలాట తప్ప నియోజకవర్గాన్ని పట్టించుకోలేదని ఎద్దేవా చేశారు. సొంత నిధులతో గ్రామాల్లో రోడ్డు, ఆలయాలు, కమ్యూనిటీ భవనాలు నిర్మించానన్నారు. కారు గుర్తుకు ఓటేసి మరొకసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరాడు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి రమేశ్, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ రవి, రైతు బంధు జిల్లా సభ్యుడు మంకయ్య, రజక సంఘం అధ్యక్షుడు నాగేశ్, ఉపాధ్యక్షుడు సుక్కయ్య, జంగయ్య, సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి వైస్ భరత్‌కుమార్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పద్మశాలి ఆత్మీయ సమ్మేళనం

శామీర్‌పేట్: అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేశారని మంత్రి మల్లారెడ్డి అన్నారు. మంగళవారం శామీర్‌పేటలోని ఓ రిసార్ట్స్‌లో జరిగిన పద్మశాలి ఆత్మీయ సమ్మేళన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సంర్భంగా పద్మశాలీల సంక్షేమానికి మరింత సహకారం అందిస్తానని, బీఆర్‌ఎస్ మేడ్చల్ అసెంబ్లీ అభ్యర్థిగా బరిలో తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.



శామీర్‌పేట్‌లో పద్మశాలి ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మల్లారెడ్డి



ఘట్‌కేసర్‌లో రజక సంఘం ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మల్లారెడ్డి

అంధకారంలో సంస్కృతి టౌన్‌షిప్

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో వీధి లైట్ల నిర్వహణ లోపభూయిష్టంగా మారిందని కాలనీవాసులు ఆరోపించారు. మంగళవారం ఇదే విషయాన్ని టౌన్‌షిప్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిప్రసాదరావు దృష్టికి తీసుకెళ్తే, ఉపాధ్యక్షుడు సత్యనారాయణతో మాట్లాడి పరిష్కరించుకోమన్నారు. సెక్యూరిటీ పనిచేయకపోతే మేమేమి చేయాలని ఉపాధ్యక్షుడు ఈ సందర్భంగా సమాధానమిచ్చారని కాలనీవాసులు చెప్పారు. గతంలో రెండు బ్లాకులకు ఒకరు సెక్యూరిటీగా విధులు నిర్వర్తిస్తే, ప్రస్తుతం నాలుగు బ్లాకులకు ఒకరే సెక్యూరిటీగా ఉండటంతో సిబ్బంది విధులను బహిష్కరించారని, దీంతో టౌన్‌షిప్‌వాసులు ఇబ్బంది పడుతున్నట్లు పేర్కొన్నారు. సిబ్బంది కుదింపు విషయంలో అసోసియేషన్ తీసుకున్న నిర్ణయాన్ని ఖండిస్తున్నట్లు మాజీ అధ్యక్షుడు శ్రీగిరి వెంకట్ మాధవ్‌రెడ్డి, మాజీ ఉపాధ్యక్షులు మెట్టు నర్సింహారెడ్డి, బద్దం శ్రీనివాస్‌రెడ్డి, కాలనీవాసులు శ్రవణ్ కుమార్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్, విజయపాల్‌రెడ్డి ఖండించారు. వీధి దీపాల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో కాలనీలో చీకట్లు వ్యాపించాయన్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించేందుకు అసోసియేషన్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎట్టకేలకు అధ్యక్షుడు హరిప్రసాదరావు స్పందించి సిబ్బందితో చర్చించి సమస్యను పరిష్కరించారు.

కీసరలో సీఎంఆర్ సిబ్బంది ప్రచారం



కీసర: మేడ్చల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మంత్రి మల్లారెడ్డికి మద్దతుగా కీసరలో మల్లారెడ్డి కళాశాల(సీఎంఆర్) సిబ్బంది ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయడం వివాదస్పదమైంది. మంగళవారం కీసరలోని అంబేడ్కర్‌నగర్ కాలనీలో కళాశాల సిబ్బంది ఇంటింటికీ ప్రచారం చేస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు వారిని అడ్డుకొని వాగ్వాదానికి దిగారు. ఇంటింటికీ తిరిగి ఎందుకు ప్రచారం చేస్తున్నారని, సీఎంఆర్ కళాశాలలో విధులు నిర్వహించుకోవాల్సిన ఉద్యోగులకు ఇక్కడ ఏమి పని అంటూ నిలదీశారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నేతలు అక్కడికి చేరుకోవడంతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను అక్కడి నుంచి చెదరగొట్టి సీఎంఆర్ కళాశాలకు చెందిన ఉద్యోగస్తులను పంపించేశారు.

తన్వీ అరోరాకు అవార్డు



ఉప్పల్: జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ(సీఎస్ఐఆర్ - ఎన్‌జీఆర్ఐ) సీనియర్ సైంటిస్టు డా.తన్వీ అరోరాకు ప్రతిష్టాత్మక ఎమినెంట్ సైంటిస్టు అవార్డు లభించింది. ఈ అవార్డును నేషనల్ ఎన్వీరాన్‌మెంటల్ సైన్స్ అకాడమి(ఎన్ఈఎస్ఏ) న్యూఢిల్లీ వారు అందజేయనున్నారు. భూగర్భజల అన్వేషణలో, క్రిటికల్ జోన్ విజ్ఞాన శాస్త్రరంగంలో ఆమె చేసిన కృషికి గుర్తింపుగా ఈ వార్డుకు ఎంపిక చేసినట్లు ఆ సంస్థ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. తన్వీ అరోరా హైడ్రోజియాలజీ థీమ్‌పై యునెస్కో-ఐజీసీపీ బోర్డు సభ్యురాలుగా ఉన్నట్లు సంస్థ తెలిపింది.

అభివృద్ధి సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం



మేడిపల్లి: అమూల్యమైన ఓటుతో బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని కార్పొరేటర్ అజయ్ యాదవ్ ప్రజలను కోరారు. మంగళవారం పీర్జాదిగూడ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుద్ధానగర్ సాయిబాబా ఆలయం నుంచి ప్రారంభించి 9, 10 డివిజన్‌లలో గడప గడపకు ప్రచారం నిర్వహించారు. మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వంగేటి ప్రభాకర్‌రెడ్డి, వేముల నాథంగౌడ్, దర్గా సుధాకర్‌రెడ్డి, కవిడ కుమార్, పుట్ట లక్ష్మణ్, రంజిత్‌రెడ్డి, అంజిరెడ్డి, జంగచారి, సుశాంత్, లక్ష్మీ, నవీన్ పాల్గొన్నారు.

మల్లారెడ్డి గెలుపును ఎవరూ ఆపలేరు



మేడిపల్లి: మేడ్చల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి చామకూర మల్లారెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి అన్నారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మొదటి డివిజన్ పరిధిలోని సుమా రెసిడెన్సీ, అయోధ్యనగర్‌లో మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం గడప గడపకు కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మల్లారెడ్డి విజయం కోసం మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు.

ఆరు గ్యారంటీలతో పేదల జీవితాల్లో వెలుగులు



బోడుప్పల్: కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టనున్న ఆరు గ్యారంటీలతో పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందని బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి అన్నారు. బోడుప్పల్ 18వ డివిజన్ పరిధిలోని సరస్వతినగర్, శ్రీలక్ష్మీనగర్, శ్రీనగర్, సాయిరాంనగర్ కాలనీలో మంగళవారం గడప గడపకు కార్యక్రమంలో పాల్గొని ప్రచారం నిర్వహించారు. మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

విద్యార్థులకు సత్కారం



మేడ్చల్: కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చిన అత్వెల్లిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించి సన్మానించారు. పాఠశాలకు చెందిన 25మంది విద్యార్థులు అండర్-14 విభాగంలో బంగారు, వెండి పతకాలు సాధించడంతో వారిని ఉపాధ్యాయులు శాలువాలతో సన్మానించి కరాటే పోటీల్లో మరింత మెరుగ్గా రాణించి మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు శిక్షకుడు సాయికుమార్ పాల్గొన్నారు.

తల్లి మందలించిందని కూతురు ఆత్మహత్య

మేడ్చల్‌రూరల్: తల్లి మందలించిందని కూతురు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలో నివాసం ఉండే భాస్కర్, సహిర దంపతుల కుమార్తె ముస్కాన్(13) కొంత కాలంగా ఇష్టానుసారంగా ప్రవర్తిస్తోందని భావించిన తల్లి మందలించింది. దీంతో మనస్థాపానికి గురైన ముస్కాన్ ఈ నెల 18న ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న కుటుంబీకులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల్లో క్రీడాసక్తిని పెంచడమే లక్ష్యం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న స్కూల్ ప్రిన్సిపల్ తదితరులు

ఉప్పల్: విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని నింపడం ఎంతో అవసరమని, దీంతో తమ నైపుణ్యంతో గొప్పగా ఎదిగేందుకు అవకాశలు ఉన్నాయని గ్లోబల్ ఇండియన్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపల్ రాధిక అన్నారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంచడమే లక్ష్యమన్నారు. ఈ మేరకు పీర్జాదిగూడ గ్లోబల్ ఇండియన్ ఇంటర్నేషనల్ పాఠశాలలో విద్యార్థులకు స్కేటింగ్, కరాటే పోటీలను నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. విజేతలకు బహుమతులను ప్రిన్సిపల్ రాధిక అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రభాకర్, విశాలాక్షి, ప్రధానోపాధ్యాయురాలు కల్పన, వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూర్తయిన ర్యాండమైజేషన్ ప్రక్రియ



సాక్షి, మేడ్చల్ జిల్లా: శాసనసభ ఎన్నికలకు సంబంధించి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను వివిధ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. అలాగే, జిల్లాకు కేటాయించిన అదనపు బ్యాలెట్ యూనిట్ల పరిశీలన కూడా పూర్తయ్యిందన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, రాజకీయ పార్టీల నాయకులతో కలిసి ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ పూర్తి చేశారు. మల్కాజిగిరి, ఉప్పల్ శాసనసభ నియోజకవర్గాలకు అదనపుంగా బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు అవసరం కాగా, మల్కాజిగిరి నియోజకవర్గానికి 1,096 బ్యాలెట్ యూనిట్లు, 23 కంట్రోల్ యూనిట్లు, ఉప్పల్ నియోజకవర్గానికి 1,060 బ్యాలెట్ యూనిట్లు, 15 కంట్రోల్ యూనిట్లు కేటాయించి ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

అసెంబ్లీ ఎన్నికలకు పూర్తి ఏర్పాట్లు చేయండి

శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఐదు నియోజకవర్గాల్లో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసేలా అవసరమైన చర్యలను ముందస్తుగా చేపడుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఈ విషయంలో అధికారులకు అవసరమైన సూచనలు జారీ చేశామన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల పరిశీలకులు పూర్వాగార్గ్, అమన్మిట్టల్‌తో కలెక్టర్ గౌతమ్ ఎన్నికల ఏర్పాట్లపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. ఎన్నికల పరిశీలకులు పూర్వాగార్గ్, అమన్ మిట్టల్ కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) కేంద్రాన్ని ఈ సందర్భంగా పరిశీలించారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో ఎన్నికల ప్రకటనలకు సంబంధించి జిల్లా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ, ఎన్నికల సంఘం విడుదల చేసిన రేట్ల ప్రకారం ఎన్నికల వ్యయం నమోదు చేస్తున్న తీరుతో పాటు రోజు వారి నివేదికల నిర్వహణ, పెయిడ్ న్యూస్ కేసుల వివరాలను వారు అడిగి తెలుసుకున్నారు.

పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: శాసనసభ ఎన్నికలకు సంబంధించి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఎన్నికల కమిషన్ సూచనలు తప్పకుండా పాటిస్తున్నామని, 30 జరిగే పోలింగ్ నిర్వహణకు కూడా అవసరమైన కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్, జాయింట్ ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్, ఉన్నత స్థాయి అధికారులతో ఆయన మాట్లాడారు. ఎన్నికల ఏర్పాట్లపై నియోజకవర్గాల వారిగా రిటర్నింగ్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్‌కు సంబంధించి ముందస్తుగానే ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో నూతన ఓటర్లకు గుర్తింపు కార్డులు పంపిణీ చేయడంతో పాటు ప్రతి ఓటరుకు సమాచార స్లిప్పులు పంపిణీ చేస్తున్నామని, అందుకు సంబంధించి ప్రతిరోజూ నివేదిక కోరుతున్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ రోజు విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. జిల్లాలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఈవీఎమ్ యంత్రాల ర్యాండమైజేషన్ పూర్తయిందన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంసీసీ నోడల్ అధికారి కృష్ణారెడ్డి, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి వంశీమోహన్, జిల్లా ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: గౌడవెల్లి సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల నరికివేత కారణంగా మంగళవారం కరెంట్ సరఫరా ఉండదని రూరల్ ఏఈ పవన్‌చందు తెలిపారు. గ్రామ పరిధిలోని అన్ని అగ్రికల్చర్ సర్వీసులకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి



మేడ్చల్‌రూరల్: విద్యార్థులు ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ కేసీ చౌదరి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నూతన ఆవిష్కరణలు, వ్యవస్థాపకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అందించే ప్రధాన మంత్రి ఎంప్లాయ్ గ్యారంటీ ప్రోగ్రాం, ముద్ర లోన్స్, స్టార్టప్ ఇండియా వంటి పథకాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి విద్యార్థులు భవిష్యత్‌లో ఉద్యోగాలు కల్పించే స్థాయిలో ఉండాలని, అందుకు అనుగుణంగా ప్రతిభను మెరుగు పర్చుకోవాలన్నారు. స్టార్టప్ ఇండియా ద్వారా ఎన్నో స్టార్టప్స్‌కి ఊతం లభించిందని, నూతన ఆవిష్కరణలతో విద్యార్థులు ముందుకు వస్తే వాటి పేటెంట్ దిశగా ఎంఎస్ఎంఈ సహకారం అందిస్తుందని వివరించారు. సేవ, ఉత్పత్తి రంగాల్లో ఎంఎస్ఎంఈ పాత్ర ఎంతో ఉందని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, డైరెక్టర్ మోహన్‌బాబు, కో ఆర్డినేటర్ శోభన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఫర్ పీపుల్ హు మూవ్' లో అఖిల్ అక్కినేని

సాక్షి సిటీబ్యూరో: వినూత్న మార్గాలను ఎంచుకుని చరిత్ర సృష్టించే వ్యక్తుల విజయగాథల్ని తెలియజెప్పేందుకు యూకేకి చెందిన ప్రముఖ పాదరక్షల బ్రాండ్ ఫిట్‌ఫ్లాప్ 'ఫర్ పీపుల్ హు మూవ్' పేరిట సరికొత్త ప్రచార కార్యక్రమాన్ని రూపొందించింది ఈ ప్రచార కార్యక్రమంలో టాలీవుడ్ హీరో అఖిల్ అక్కినేని, ఫ్యాషన్ రంగానికి చెందిన నందినీ భల్లా, వెడ్డింగ్ ఫొటో గ్రాఫర్ జోసెఫ్ రాధిక్ తదితరులు కీలకపాత్ర పోషిస్తున్నారని, దేశవ్యాప్తంగా ఇది నిర్వహిస్తున్నామని మెట్రో బ్రాండ్స్ లిమిటెడ్ ప్రతినిధులు తెలిపారు.